# ఓ మహిళా దారి ఇదిగో...

మేస్టారి కోపం చూడ్డానికి పౌర్ణమినాటి వెన్నెల్లా తెల్లగా చల్లగా ఉన్నా, అనుభవానికి వచ్చేసరికి నట్టనడి వేసవిలో మిట్టమధ్యాహ్నపు ఎండలా తీవ్రంగా ఉంటుంది. పైగా "అమ్మాయ్ హోంవర్కు చెయ్యలేదేం? ఓ గంటసేపు ఎండలో నిలబడు... ఊ" అంటే ఆ ఎండే వెన్నెల్లా వుంటుంది. అదే... "హోంవర్కు చేయ్యలేదా... ఊ సరే" అని పెదాలుబిగించి రెప్పెయ్యకుండా ఓసారి చూసి తలపంకించేరంటే అది మరి భరించలేను నేను. నేనే కాదు బహుశా ఎవరూను.

అంతకుముందు క్లాసులో ఇంగ్లీషు ఏ మేస్టారెలా చెప్పేవారోకూడా తెలియనంత మరపుకొచ్చిందిగాని, మేస్టారు మాత్రం పాఠంలోకి తిన్నగా వెళ్ళిపోయేవారు కాదు. ఒక్కో స్ట్రక్చరూ తీసుకుని తీగమీద డ్రిల్లు చేయించినట్టు చేయించి, ఒక్కోకంటెంటూ వర్డూ తీసుకుని ఒక్కో పిప్పరమెంటు బిళ్ళ నోట్లోవేసి చప్పరించినట్టు చేయించేవారు. ఆ పైన ఒక్కసారో రెండుసార్లో పాఠం చదివించి అరటిపండు వలిచి చేతిలో పెట్టేసేవారు. అంతవరకూ ఇంగ్లీషంటే భూతమో దయ్యమో అని జడుసుకునే నాలాంటి అమ్మాయిలంతా మేస్టారు సోషల్‌స్టడీస్ చెప్పబోతే "ఇంగ్లీషు చెప్పండి మేస్టారూ ....." అంటూ మారాం చేసేవాళ్ళం. "మరీ అంత వేలంవెర్రి కూడదర్రా" అంటూ మందలించేవారు.

"బేడ్మింటను నేర్చుకుంటారర్రా... నేర్పిస్తాను..." అని ఓసారి అన్నారు మేస్టారు. "ఛీ....... బేడ్మింటనా?" అని ఒకరూ...., "అయ్యోరామా.... మా కెందుకండీ....." అంటూ మరొహరూ సాగదియ్యబోతే.... "ఏవమ్మా మంగతాయారు ... తల్లీ మీరు మాత్రం సినిమా హీరోయిన్లా ఒళ్ళుపెంచండమ్మా... చూడూ... ఓ ఇద్దరు కుర్రాళ్ళెదురొచ్చి ఏయ్ అంటే బేర్‌మందురు గాని.... అమ్మా ఒద్దు తల్లీ ఒద్దు..." అంటూ హాస్యంగా వ్యంగ్యంగా అని ఆ మంగ తాయారునీ, అదే సుబ్బలక్ష్మినీ ఛాంపియన్‌గా

నిలబెట్టిన మా మేస్టారు కదా' అన్న భావమే.... అది నిర్లక్ష్యమో.... మరి నిర్లిప్తమో.... ఇంకా నిరీప్తమో.... ఇంకా నిర్భీతో రఘు మాత్రం చక్కా మేజోడు మడతల్లోంచి కాగితంముక్కలు లాగి కాస్త సాహసం చేయబోయేడుపరీక్షల్లో.

"ఏమిటోయ్... తెచ్చుకున్నావ్... ఏదీగురుదక్షిణగా ఇచ్చెయ్ నాయనా." అన్నారు. తమాషాగా అనిపించడంవల్ల కాబోలు రఘు అహం దెబ్బతింది. అంతేకాదు ఆ అమ్మాయిల దగ్గరే ఆ మేస్టార్నే అవమానిస్తే అతనిమీద హీరోవర్‌షిప్ పెరిగిపోతుందనుకున్నాడు.

స్టైల్‌గా బెల్‌బాటమ్ ఫేంటు వేసుకున్న కాలును బెంచీమీద పెట్టి, ఓ చెయ్యి నడుంమీద పెట్టి వెనకనున్న గేంగ్‌కేసి చూస్తూ. "ఒరేయ్! మేస్టారికి గురుదక్షిణ కావాల్ట్రా గురుదక్షిణ.." అన్నాడు. వెంటనే ఒహడు... "తగ్గ గురూ తగ్గు... ఇక్కడ కాదు..." అంటూ కాస్త తొందర తొందరగానూ, నచ్చజెప్తున్నట్లుగానూ అన్నాడు. ఆ వెంటనే నడుం మీద పెట్టిన చెయ్యి దించకుండా రెండో చేత్తో ఆ స్లిప్స్ విసిరేసి... ఆ విసిరేసిన చేత్తోనే జులపాల జుత్తుని సుతారంగా దువ్వుకున్నాడు.

ఓ కుర్రాడు యిలా అవమానం చేసేడనికాదుగానీ... ఇంత అక్రమంగా ప్రవర్తించేడంటే తన శిక్షణలోనే ఏదో లోపం ఉందని బాధపడ్డారు మేస్టారు. అది మేం ఇంటర్మీడియేటులో చేరాక మంగతాయారూ, సుబ్బలక్ష్మి, నేనూ మేస్టారి గౌరవార్థం ఇచ్చిన టీ పార్టీలో ఆయనే చూచాయగా వ్యక్తంచేసేరు... "చాలా సంతోషమర్రా.... నా తయారీలో కొన్ని బొమ్మలు వికృతంగా తయారైనా ఎక్కువ శాతం అందంగా తయారయ్యాయంటే మరి నా కానందవే..." అంటూంటే ఆయన సంస్కారం ఎంతని చెప్పను!

మేస్టారు వేసిన పునాదిబలంతో ఇంటర్మీడియేటులో చేరింది నేనూ, మంగ తయారూ, సుబ్బలక్ష్మియే కాదు.... చెప్పకేవీ, రఘూ, అతని గేంగ్‌లో మరో ఇద్దరు కూడా వున్నారు.

కాలేజీలో జరిగే ఇండిపెండెన్స్‌డే, రిపబ్లిక్ డే, కాలేజీడే లకు జరిగే ఇంగ్లీషు

డిబేట్లలో నేను పాల్గొనే ధైర్యమూ, బహుమతి పొందగలిగే యోగ్యతా వచ్చేయంటే అది మేస్టారి చలవకాక మరేమౌతుంది. పైగా ఆ మేస్టార్ని నా ఉపన్యాసాల్లోనూ, వ్యాసాల్లోనూ తల్చుకోకపోతే అది కృతఘ్నతకాక మరేమౌతుంది!

"ఒరేయ్ గురూ... మేస్టార్ని తల్చుకుంటోందేవిట్రా... కొంపతీసి మేస్ట్రూ, ఇదీ కథల్లాగించిలేదు కదా..." "లాగించే ఉంటారు గురూ... లేపోతే హైస్కూలు మేస్టర్లనీ.... ఎలిమెంటరీ స్కూలు మేస్టర్లనీ ఇంకా తల్చుకోవటమేవిట్రా..." అంటూ ఇంకా ఏవేవో పొగరుగా మాట్లాడబోయేడు రఘు. నాకు విపరీతమైన ఆవేశం వచ్చేసింది. మేస్టారనేవారు...' ఓ ఇద్దరు కుర్రాళ్లెదురొచ్చి ఏయ్ అంటే బేర్మందురుగాని... అందరు ఆడవాళ్ళూ అలా మూసల్లో పోసినట్టుగా కాకపోతే... కాస్త చదువుకున్నందుకు మీరైనా మారకూడదటర్రా...' అని. అది కూడా జ్ఞాపకం వచ్చి కాలిచెప్పు తీయబోయేను. మనకు స్థానబలిమి లేదని మంగతాయారు వారించకపోతే ఏవయ్యేదోమరి!

మరో రోజా అంతే...

ఆవేళ డిబేటులో 'మరపురాని మనుషులు' శీర్షిక కింద మాట్లాడుతూ... 'మేస్టారు... నాకు దైవమని' ముగించాను. అంతే, మర్నాడు 'మేస్టారూ... మీరే కావాలి...' 'మేస్టారూ మీరే దైవం', 'మేస్టారూ మీరే నాకు పతియు, గతియు....' అంటూ రఘూవాళ్ళ బేచ్ వెక్కిరింతలూ, వెటకారాలూ.

మేస్టారంటే పంచె, కల్లీ లాల్చీ, చంకలో గొడుగూ... రూపమయితే ఇంత రాద్ధాంతం జరిగి ఉండేది కాదేమో! కాని మా మేస్టారంటే మాత్రం చక్కని మీసకటూ, ముప్పయ్యేళ్ళ వయసూ, సొగసున్న బ్రహ్మచారీ కావడంవల్లనేమో పాపం నావల్ల రఘూవాళ్ళ నోళ్ళలో నానుతున్నారు. కాని ఏం చేసేది? వీళ్ళకెలా బుద్ధి చెప్పేది? చెప్పుతీసి ఎడా పెడా నాలుగంటించేదామనిపించేది కాని తర్వాత దుష్ఫలితాల మాటేవిటి? పోనీ మేస్టారితో చెప్పి బుద్ధి చెప్పించుదామంటే.... మేస్టారిమాట అప్పుడే వినలేదు ఇప్పుడు వింటాడా... పైగా మేస్టారితో తాను ఏమని చెప్పుకుంటుంది?

రోజూ నా ఆలోచనల్నిలా ఈగల్లాగా, దోమల్లాగా ముసురుకుంటూ పొగల్లాగా సెగల్లాగా సుళ్ళు తిరుగుతూనే ఉన్నాయి.

కాని ఆ రోజు....

నేనూ, మంగతాయారూ, సుబ్బలక్ష్మి ఎన్నాళ్లనుండో అనుకుంటున్న మల్లీశ్వరికి ఫస్టుషో ప్రోగ్రాం వేసుకున్నాం. ఏ సెంటర్ హాల్లోనో అయితే ఫర్వాలేకపోనుగానీ, ఇలాంటి పాత సినిమాలు మూలనున్న థియేటర్ల వాళ్ళే తెప్పిస్తారో ఏమో! వెళ్ళేటప్పుడు ఉత్సాహంలో ఏ సంకోచాలూ రాలేదుగానీ... సినిమా విడిచిపెట్టేక... వచ్చిన కొద్దిమంది ప్రేక్షకులూ కొంత దూరానికి చెల్లు అయిపోయాక, మిగతా దూరం నడిచి ఇంటికి చేరాలనుకునేసరికి ముగ్గురికీ చెప్పొద్దూ భయంవేసింది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

"పదండే... పిరికి మొద్దుల్లారా... ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం.... మనల్ని ఎవడేం చేస్తాడే... పదండి పదండి...." అంటూ బింకంగా నడుస్తున్న సుబ్బలక్ష్మి... "ఇదో తాయారూ.. వెనక ఎవరో వస్తున్నట్టుగున్నారూ... నువ్వు కాస్త ఇట్రావే..." అంటూ పక్కకి లాక్కుంది.

సుబ్బలక్ష్మి మాటలకీ, చేతలకీ నవ్వుకుంటున్న మేము మా వెనక,దగ్గరగా ఓ ముగ్గురు చీకటినీడల్లా నిల్చునేసరికి మా నవ్వులూ నిశ్శబ్దాలై నిలబడిపోయేయి.

పొగలు కక్కుతూన్న నిప్పుకణికల వెల్తుర్లో మమ్మల్ని పరకాయించి చూసినట్టున్నాయ్.."ఓసోస్ మనోళ్ళే గురూ..." అని ఓహటీ...', "ఎవర్రా గురూ..." అంటూ మరోకంఠం...', "మేస్టారి భక్తురాలూ... వారి ఇష్టసఖులూనూ" అని జవాబూ...',"మరి చెప్పవేం... లక్కీఛాన్సు... ముగ్గురికీ మూడు..." అంటూ పంపకాలూ- అన్నీ వింటూ నడుస్తున్న మాకు నిప్పుకణికలు సిగరెట్లనీ, వాటిని పట్టుకు గాలిలో నడిపించినవి మూడు జతల పెదాలనీ... ఆపెదాల తాలూకు శాల్తీలు రఘూ, వాళ్ళిద్దరి ఫ్రెండ్సూ అని కొంతదూరం నడిచాక ఒంటరిగా నిల్చున్న లైటు స్తంభం దగ్గరగానీ తెలిసింది కాదు.

వాళ్ళ మెడలమీద కత్తివేటులాంటి అరిచేతి పోటుతో దెబ్బతీస్తున్నారు. అందులో ఏదో ఇష్టం వచ్చినట్టు దెబ్బకొట్టడంలా కాక ఏదో నేర్పు కనిపిస్తోంది. కొద్దిసేపట్లో వాళ్ళు ముగ్గురూ నేలకరిచేక కానీ, అది బహుశా ఆయన కుస్తీ పట్లో, జూడో నేర్చుకుని వుంటారని మాకు తట్టిందికాదు.

"పదండర్రా, మీ ఇళ్ళదగ్గర దిగబెట్టిపోతాను." అంటూ చేతులు దులుపుకుంటూ మా దగ్గరకొచ్చాక కూడా ఆయన విగ్రహంకేసి కళ్ళప్పగించి చూస్తూండిపోయేం.

"ఏవిటర్రా... అలా ఉండిపోయేరు? పదండి పదండి ఇళ్ళదగ్గర మీ వాళ్ళెంత గాభరా పడుతుంటారో..." అంటూన్న ఆయన మాటలకడ్డుపడుతూ "అదికాదు మేస్టారూ. మీరు ఫైటింగ్..." అంటూ నసిగేను.

"అదా... నేర్చుకున్నానులే... లేకపోతే ఇన్విజలేషన్సులోనూ, స్టూడెంట్ల గొడవలలోనూ నెగ్గుకురాగలనా..." అంటూ తేలిగ్గా నవ్వేసి, "సరేగాని... మంగతాయారూ, నువ్వూ జూడో నేర్చుకుంటావేమిటి?" అన్నారు మేస్టారు నడుస్తూ.

ఠీవిగా మా ముందు నడుస్తూన్న మా మేస్టార్ని చూస్తూంటే, ఆయన అన్నమాటలు వింటూంటే... రఘులాంటి వాళ్ళకెలాబుద్ధిచెప్పాలా అని ఆలోచిస్తూ ఉండే నాకు ఏదో మార్గం చూపిస్తున్నట్టు అన్పించింది.

*(యువ, జూలై 1976)*